రంగనాయకసాగర్‌లో గోదావరి జలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది విషప్రచారం

మొదటిపేజీ తరువాయి...

గోదావరి జలాలను హరీశ్‌రావు తిలకించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో 229 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. చెరో ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలకు ఈ రెండు పార్టీలు చేసింది గండు సున్నా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎనిమిది సీట్లు ఇచ్చిన తెలంగాణ బీజేపీకి చేదు అయ్యిందని, ఆంధ్ర మాత్రం తీపి అయ్యిందని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలు, అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను అరిగోస పెడుతున్నదని విమర్శించారు. రైతుబంధు రాక రైతులు, పింఛన్లు రాక అవ్వాతాతలు అరిగోస పడుతున్నారని చెప్పారు. కేసీఆర్ ఆడబిడ్డల పెండ్లికి, కల్యాణలక్ష్మి పేరుతో రూ.లక్ష, ఆడబిడ్డ కాన్పుకు పోతే కేసీఆర్ కిట్ ఇచ్చారని, నేడు కల్యాణలక్ష్మి లేదు, కేసీఆర్ కిట్టు లేదని పేర్కొన్నారు. కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.200 నుంచి రూ.2000కు పెంచారని, కాంగ్రెస్ ప్రభుత్వం పెంచకపోగా, ఉన్నదే ఇవ్వడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో జూన్‌లోనే రైతుల ఖాతాలో రైతుబంధు వేశారని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదని గుర్తుచేశారు. గల్లీగల్లీకి బెల్టుషాపులు పెట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే మద్యంపై ఈ బడ్జెట్‌లో రూ.7,500 కోట్ల అధిక ఆదాయం టార్గెట్ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, మారెడ్డి రవీందర్‌రెడ్డి, కడవేర్గు రాజనర్సు, ముల్కల కనుకరాజు పాల్గొన్నారు.

కవిత అంటే గౌరవం.. కేటీఆర్ అంటే ఇష్టం

- వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తపరిచిన బీజేపీ ఎమ్మెల్యే
- ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో పైడి రాకేశ్‌రెడ్డి

నిజామాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో చేసిన కీలక ప్రకటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ముఖాముఖి ప్రశ్నలో కవిత, కేటీఆర్ ప్రస్తావన రావడంతో తన వ్యక్తిగత అభిప్రాయమని నొక్కి చెబుతూ కీలక ప్రకటన చేశారు. జైలులో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత త్వరగా విడుదల కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కవిత అంటే గౌరవం, కేటీఆర్ అంటే ఇష్టమంటూ తెలిపారు. 'ఆ బాధ రావొద్దు... వచ్చింది కాబట్టే నేనను కుంటాను దేవుడు ఎంతో మందిని క్షమిస్తాడు... మా సోదరిని క్షమించమని కోరుకుంటా'నని చెప్పుకొచ్చారు. రాజకీయాలు, వ్యక్తిగతం వేర్వేరు అంటూ స్పష్టం చేశారు. కవిత ఇందూరు కోడలు అంటూ పేర్కొన్నారు. విధానపరంగా పోరాటం చేసేటప్పుడు రాజీలేదని బీజేపీ ఎమ్మెల్యే అంటూనే తన మనసులోనే భావాలను వ్యక్తపరిచారు. కన్నబిడ్డ ఇబ్బందికర పరిస్థితిలో ఉన్నప్పుడు ఎవరికైనా బాధ ఉంటుందని పెద్దాయన ప్రత్యేక పరిస్థితుల్లో కవితను కలవలేక పోతున్నట్టుగా పైడి రాకేశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

బ్రాండ్ తెలంగాణను బలిపెట్టొద్దు

మొదటిపేజీ తరువాయి...

అమరరాజా వెళ్లిపోతానని చెప్పటం తెలంగాణ బ్రాండ్‌కు నష్టమని చెప్పారు. రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం మంచిది కాదని ప్రభుత్వానికి సూచించారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ పాలసీలు ఉండాలని పేర్కొన్నారు.రాష్ట్రంలో రూ. 9,500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా అమరరాజా సంస్థను ఎంతో కష్టపడి ఒప్పించామని, ప్రభుత్వం మారిన తర్వాత ఆ సంస్థ ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు.సంస్థ విషయంలో కాంగ్రెస్ సర్కారు సానుకూలంగా స్పందించాలని సూచించారు. అమరరాజా సంస్థ తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే కొనసాగిస్తుందని ఆశిస్తున్నానని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

బహ్రెయిన్ జైల్లో బందీగా సిరిసిల్ల వాసి

- నర్సయ్యను బంధ విముక్తం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి
- తాత్కాలిక పాస్‌పోర్ట్ జారీ కోసం విదేశాంగశాఖకు లేఖ
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): బహ్రెయిన్ జైల్లో చిక్కుకుపోయిన సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన 62 ఏండ్ల మానువాడ నర్సయ్యను స్వదేశం రప్పించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భారత విదేశాంగ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన విదేశాంగశాఖ మంత్రి ఎస్ జయశంకర్‌కు ఒక లేఖ రాశారు. పాస్‌పోర్ట్ సమస్యల కారణంగా నర్సయ్య బహ్రెయిన్ జైల్లో ఉన్నారని తెలిపారు. బతుకుదెరువు కోసం నర్సయ్య 1996లో బహ్రెయిన్ వెళ్లారు. అక్కడి 'ది అరబ్ ఇంజినీరింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీ'లో మూడేండ్లపాటు తాపీ మేస్త్రీగా పనిచేశారు. 1999 ఆగస్టులో వర్క్ పర్మిట్ ముగిసినా నర్సయ్య అక్కడే పని చేస్తూ ఉన్నాడు. పాస్‌పోర్ట్ గడువు కూడా 2001లో ముగియటంతో బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ రెన్యువల్ చేసింది. ఆ గడువు కూడా ముగిసిందని, అయితే నర్సయ్య తనవద్దనున్న పాస్‌పోర్ట్ పొగొట్టుకున్నాడు. వర్క్ పర్మిట్, పాస్‌పోర్ట్ లేకపోవటంతో అక్రమంగా తమ దేశంలో ఉంటున్నాడంటూ బహ్రెయిన్ పోలీసులు నర్సయ్యను అరెస్ట్ చేసి జైల్లో ఉంచారు. నర్సయ్య విషయమై అతని భార్య లక్ష్మి, కూతుళ్లు సోన, అపర్ణ, కుమారుడు బాబు ఆందోళన చెందుతున్నారని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. నర్సయ్యకు తాత్కాలిక పాస్‌పోర్ట్‌ను ఇచ్చే విషయంలో చొరవ చూపాలని విదేశాంగ శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

నర్సయ్యను స్వదేశం రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించి పాస్‌పోర్ట్ జారీ అయ్యేలా చూడాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. నర్సయ్యను విడుదల చేసి భారత్‌కు పంపించాలంటే ఆయన భారతీయుడని తెలిపే ఆధారాలను బహ్రెయిన్ ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. నర్సయ్య గుర్తింపును ధృవీకరించాలని బహ్రెయిన్ ప్రభుత్వ సంస్థ లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ అథారిటీ 2024 జనవరి 8న అక్కడి భారత రాయబారికి లేఖ రాసిందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం తాత్కాలిక పాస్‌పోర్ట్ జారీచేస్తే బహ్రెయిన్ ప్రభుత్వం నర్సయ్యను డిపోర్ట్ చేసే అవకాశం ఉందని తెలిపారు. బహ్రెయిన్‌లోని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం సమన్వయం చేసుకొని నర్సయ్య విడుదలకు సహకరించాలని సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి పాత రికార్డులను పరిశీలించి నర్సయ్య చిరునామా కనుక్కొని సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల ద్వారా నివేదిక ఇవ్వాల్సి ఉందని, ఈ విషయంలో హైదరాబాద్ పాస్‌పోర్ట్ అధికారి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి వీలైనంత త్వరగా నివేదిక ఇచ్చేలా ప్రయత్నం చేస్తానని కేటీఆర్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంతోపాటు రాష్ట్ర ఎన్నారై వ్యవహారాలశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రక్రియను మరింత వేగంగా అయ్యేలా తన కార్యాలయ సిబ్బందికి కేటీఆర్ ఆదేశించారు.

బండీ.. రేవంత్ ప్రతినిధివా?

- బండి సంజయ్‌ను ఎర్రగడ్డ హాస్పిటల్‌లో చేర్చాలి
- అసమర్థులు, చదువురానివాళ్లు కేంద్రమంత్రులు
- తెలంగాణకు నయాపైసా తీసుకురాని దద్దమ్మలు
- పదేండ్ల అభివృద్ధికా.. కేటీఆర్‌ను అరెస్టు చేయాలి?
- బండిపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి
- 10 శాతమైనా సర్పంచ్‌లను గెలవాలని సవాల్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): బండి సంజయ్ కేంద్ర మంత్రా? లేక కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధా? అని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి నిలదీశారు. రేవంత్‌ను తిడితే కాంగ్రెసోళ్లే సరిగా పట్టించుకోవటం లేదని, కానీ బండి సంజయ్ న్యూఢిల్లీ నుంచి వచ్చి ఇక్కడ మాట్లాడాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. రేవంత్‌కు అధికార ప్రతినిధిలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు బండి సంజయ్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అర్హత అయినా తెలుసా? అని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను రేవంత్‌రెడ్డి జైల్లో వేస్తారన్న బండి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో శ్రీధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్‌ను జైల్లో పెట్టకపోతే తాను యుద్ధం చేస్తానన్న బండి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. ఒక కేంద్ర హోంశాఖ సహాయమంత్రి ఇసుమంత అవగాహన లేకుండా, తెలివితక్కువతనంతో ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. కేటీఆర్ ఏం తప్పు చేశారని జైల్లో పెడతారని నిలదీశారు. ఎంపీగా మసీదులు తవ్వాలె.. శవాలు తవ్వాలె.. లాంటి పిచ్చి మాటలు మాట్లాడితే పోనీలే అని అనుకున్నామని, కేంద్ర మంత్రి హోదాలోనైనా బుద్ధి తెచ్చుకొని జ్ఞానంతో మాట్లాడాలని చురక అంటించారు. లేకపోతే ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సిన అవసరం వస్తుందని ఎద్దేవా చేశారు.

కేటీఆర్‌పై ఏమైనా ప్రశ్నపత్రాల లీకుల కేసులున్నయా?

'జైల్లో వేయటం మంత్రులు, ముఖ్యమంత్రుల పనా? కేటీఆర్‌పై ఏమైనా పదో తరగతి ప్రశ్నపత్రాల లీకుల కేసులు ఉన్నాయా? ఎమ్మెల్సీలకు డబ్బులు ఇస్తే దొరికిపోయిన కేసులు ఉన్నాయా?' అని బండి సంజయ్‌పై శ్రీధర్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మోదీ, జైశ్రీరాం నినాదాల వల్ల బండికి ఆ పదవి వచ్చిందని, అలాగని కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. పదేండ్లు రాష్ట్ర మంత్రిగా కేటీఆర్ చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని.. రాష్ట్రానికి 3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 25 లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించిన కేటీఆర్‌ను అరెస్టు చేయాలని మాట్లాడటం ఎంత చిల్లర విషయమో తెలుసుకోవాలని మండిపడ్డారు. ఎంపీగా కరీంనగర్‌కు కనీసం ఒక్క కల్వర్టుకైనా నిధులు తీసుకొచ్చారా? అని బండిని నిలదీశారు. తమరు రాష్ట్రానికి ఏం చేశారో కనీసం ఐదు నిమిషాలైనా చెప్పగలరా? అని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నయాపైసా తీసుకురాని దద్దమ్మలు రాష్ట్ర కేంద్రమంత్రులు అని ధ్వజమెత్తారు. ఇద్దరు తెలివితక్కువ, అసమర్థులు, చదువురానివాళ్లు కేంద్ర మంత్రులుగా రాష్ట్రానికి భారంగా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

ఎమ్మెల్యేగా బండి ఓడిపోయింది బీఆర్ఎస్‌పైనే

బీఆర్ఎస్ అవుట్ డేటెడ్ పార్టీ అన్న బండి వ్యాఖ్యలకు శ్రీధర్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యేగా బండి సంజయ్ ఎవరి చేతిలో ఓడిపోయారు? అని ప్రశ్నించారు. 'బండి సంజయ్‌కు దమ్ముంటే కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్‌లో పది శాతం సర్పంచులు, పంచాయతీ ఎన్నికలల్లో పది శాతం ఎంపీటీ సీలు, ఒక జడ్పీటీసీ సీటు గెలిపించాలి. కిషన్‌రెడ్డిని కూడా అడుగుతున్నా. దమ్ముంటే తన సొంత గ్రామంలో బీజేపీ అభ్యర్థిని సర్పంచ్‌గా గెలిపించాలి' అని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి మెప్పు పొందటం కోసం బీజేపీ నాయకులు ఎందుకు పాకులాడుతున్నారని విమర్శించారు. కేంద్రంలో నితీశ్ నారా డిఫెన్స్ అలయన్స్ అయిందని, తెలంగాణలో బీజేపీ-కాంగ్రెస్ కూడా రేవంత్‌రెడ్డి, బీజేపీ అలయన్స్ అయ్యిందని ఆరోపించారు. బలమైన నిర్మాణం ఉన్న బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం అయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతి

రాహుల్‌గాంధీకి ఎక్స్‌వేదికగా కేటీఆర్ ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు11 (నమస్తే తెలంగాణ): అదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నదని, దీనిపై సమాధానం ఉన్నదా? అని కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. అదానీ, సెబీ చైర్మన్ ఇటీవల భేటీ కావడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాహుల్‌గాంధీ సైతం ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. పీఎం మోదీకి పలు ప్రశ్నలు సంధించారు. సెబీ సమగ్రత దెబ్బతిన్నదని, అదానీ అంశంలో జేపీసీ వేసేందుకు కేంద్రం ఎందుకు వెనకడుగు వేస్తున్నదని రాహుల్ ప్రశ్నించారు. ఆయా అంశాలను ఉటంకిస్తూ ఎక్స్‌వేదికగా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో అదానీ కోసం చురుగ్గా ప్రచారం చేస్తున్న సీఎం వల్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి కూడా రాజీ పడిందని పేర్కొన్నారు. అదానీకి తెలంగాణలో రెడ్ కార్పెట్ స్వాగతం ఎందుకు పలుకుతున్నారని, ఆ ద్వంద్వ ప్రమాణాలపై సమాధానం ఉన్నదా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. అదానీ, రేవంత్ రెడ్డి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. సెబీ చీఫ్ అదానీతో భేటీ కావడం షాకింగ్‌గా ఉన్నదని విస్మయం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉండే ఏజెన్సీ ద్వారా దర్యాప్తు చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు.

నిరసన తెలిపినందుకు మాజీ ఎమ్మెల్యేపై కేసు

మట్టెవాడ, ఆగస్టు 11: వరంగల్ ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కుతిన్న ఘటనను నిరసిస్తూ దవాఖాన ఎదుట ధర్నా చేసిన తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తోపాటు తొమ్మిది మందిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. మూడురోజుల క్రితం ఎంజీఎంలో శిశువును కుక్కలు పీక్కుతిన్న ఘటనను నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే నరేందర్ తన కార్యకర్తలతో దవాఖాన గేటు ఎదుట ధర్నా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నా చేసినందుకు మాజీ ఎమ్మెల్యేతోపాటు 34వ డివిజన్ కార్పొరేటర్ కుమారస్వామి, రవి, కొంగ రాజేందర్, ఎలగంటి సతీశ్, ఎలగంటి మధు, సీతారాం, బజ్జూరి వాసు, తోట ప్రవంతిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో రైతు మృతి

ఇనుగుర్తి, ఆగస్టు 11: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారంలో ఆదివారం విద్యుత్తు షాక్‌తో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన దర్శనం సోమయ్య (55) పొలంలో పనులు చేస్తుండగా బావి మోటర్ సర్వీస్ వైరు కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

గురుకులంలో విద్యార్థికి విద్యుత్తు షాక్

గోవిందరావుపేట, ఆగస్టు 11: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం విద్యార్థి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు.తాడ్వాయి మండలం బయ్యక్కపేటకు చెందిన నీరటి ముఖేశ్ కర్లపల్లి గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నాడు. మధ్యాహ్న భోజనం తరువాత కిటికీ చువ్వకు కట్టిన విద్యు త్ వైరును తాకడంతో షాక్ తగిలి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న ఏఎన్ఎం ఆదిలక్ష్మి 108కు సమాచారం అందించగా, సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ములుగు దవాఖానకు తరలించారు.

జాతీయ పార్టీల కుట్రలను అడ్డుకుంటాం

- బీజేపీ కాంగ్రెస్.. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ
- రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తం..షాడో పాలన
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేకానంద్, ముఠాగోపాల్

హైదరాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివా? కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సహాయ మంత్రివా ? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే పీ వివేకానంద బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్నా.. సీఎం రేవంత్‌రెడ్డికి కోవర్టుగా పని చేస్తున్నావని ఆరోపించారు. ఈ విధంగా వ్యవహరించడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఉత్తరాల రాసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేయాలన్న కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు కలిసి బీఆర్ఎస్ పార్టీని లేకుండా చేయాలన్న ప్రయత్నాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నుంచి వారి మైత్రిబంధాన్ని బలోపేతం చేసుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ ఎమ్మెల్యేను పొగిడారని, రేవంత్‌రెడ్డి కూడా ఏబీవీపీ నుంచి వచ్చినవాడేనని తెలిపారు. ఢిల్లీలో కుస్తీ చేసుకుంటూ, గల్లీలో దోస్తీ చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్, కేటీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అరెస్ట్ చేయాలి? అనడంపై మండిపడ్డారు. కేటీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయాలి? హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినందుకా? లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చినందుకా? 25 లక్షల ఉద్యోగాలను అందించినందుకా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. జాతీయ పార్టీల కక్షపూరిత రాజకీయాలను గమనిస్తున్నామని, ఇలాంటి కుట్రలను సహించేది లేదని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో పెద్ద పెద్ద నాయకులను ఎదుర్కొన్నామని, ఈ నాయకులంతా కేసీఆర్ కాలిగోటికి సరిపోరని విమర్శించారు. ఢిల్లీకి కప్పం కట్టే రాష్ట్ర నాయకత్వంలో పాలన గాడి తప్పిందని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని కుంభకోణాలేనని, ఒక వైపు లిక్కర్ మాఫియా, మరో వైపు ఇసుక దందా, 7+1 శాతం అక్రమ వసూళ్లు ఉన్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకులాల్లో పిల్లలు చనిపోతున్నారని.. పల్లెలు పడకేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో షాడో ముఖ్యమంత్రులు.. షాడో మంత్రుల ఆధ్వర్యంలో పాలన కొనసాగుతుందని ఆయన విమర్శించారు.

గాడి తప్పిన శాంతిభద్రతలు ఎమ్మెల్యే ముఠాగోపాల్

హైదరాబాద్‌లో శాంతిభద్రతలు గాడి తప్పాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ మండిపడ్డారు. ఓల్డ్‌సిటీలో రోజుకో హత్య జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రౌడీషీటర్లు పేట్రేగిపోతున్నారని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో పాలన లేకపోవడం వల్ల చెత్తాచెదారం, మట్టికుప్పలు పేరుకుపోయిందని ధ్వజమెత్తారు. దోమల వ్యాప్తి పెరిగిపోతుండడంతో, డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని నియంత్రించే అధికారులు లేకపోవడం బాధాకరమని వాపోయారు. గ్రూప్-1, గ్రూప్-2 నిరుద్యోగులు బయటకు రావడానికి భయపడుతున్నారని తెలిపారు. కరెంటు కోతలు పెరిగాయని అన్నారు. నగరంలో ఎక్కడ చూసినా వీధికుక్కల స్వైరవిహారం వల్ల మరణాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలన పూర్తిగా పడకేసిందని, అసలు ప్రభుత్వం ఉందా? లేదా? అని ఎమ్మెల్యే ఆగ్రహించారు.

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రైతుల నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

ఫార్మాకు భూములియ్యం

- 'కొడంగల్-నారాయణపేట'పై రైతుల ఆందోళన ఉధృతం
- వికారాబాద్ జిల్లా హకీంపేటలో రోడ్డెక్కిన భూబాధితులు
- ఐటీ, టెక్స్‌టైల్, ఈవీ పరిశ్రమలు తేవాలంటున్న రైతన్నలు
- ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తే సహించం : మాజీ ఎమ్మెల్యే పట్నం

కొడంగల్, ఆగస్టు 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో 'కొడంగల్-నారాయణపేట' ఎత్తిపోతల పథకం ముసుగులో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫార్మా కంపెనీలకు భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టంచేశారు. తమ ప్రాంతంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన పేరుతో సాగు భూములను గుంజుకుని కాలుష్యం వెదజల్లే ఫార్మా కంపెనీలకు కట్టబెట్టేందుకు ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై బాధిత రైతులు ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి సమస్యను వివరించిన విషయం తెలిసిందే. కొడంగల్ ప్రజలకు హాని కలిగించే ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని సర్కారు వెనక్కి తీసుకోవాలని రైతులు రోజురోజుకూ ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో ఫార్మా కంపెనీ భూ బాధిత రైతులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కలలుకంటున్న కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం నియోజకవర్గ రైతుల కోసమా? లేక ఫార్మా కంపెనీల కోసమా? అంటూ ప్రశ్నించారు. కొడంగల్ ప్రజల ప్రయోజనాల కోసం చేపట్టే ఎటువంటి అభివృద్ధి పనులకైనా పూర్తి మద్దతు ఇస్తామని, కానీ ఫార్మా కంపెనీలు తీసుకొచ్చి పొల్యూషన్ అంటగట్టేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని నమ్మబలుకుతూ కొడంగల్ అమాయక ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేసే విధంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు సెంటు భూమిని కూడా ఇచ్చేది లేదని, రైతుల పక్షాన ఉంటూ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. అభివృద్ధి పేరుతో సాగు భూములను లాక్కుంటులే ఎత్తిపోతల పథకంతో వచ్చే సాగునీరు ఏం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నట్టు తెలిపారు. భూములే లేనప్పుడు సాగునీరెందుకుని నిలదీశారు. కొడంగల్ ప్రజలు రేవంత్‌కు సీఎం పదవిని కట్టబెడితే.. రేవంత్ కొడంగల్ ప్రజలకు బహుమానంగా పొల్యూషన్‌ను అంటడగుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కోవాలని, ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, రైతులు, ప్రజలకు బీఆర్